తెలంగాణ
ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ | ఆదివారం | 24 - 05 - 2026 | ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి | పేజీలు : 4

# ఎంట్రెన్స్ పరీక్షల్లో అక్షర విద్యార్థులకు స్టేట్ ర్యాంకులు



భానుష్క



సాయిసూరజ్



అర్చన

- పాలీసెట్, టీజీఆర్‌జేసీలో సత్తా చాటిన స్టూడెంట్స్
- ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించిన స్కూల్ డైరెక్టర్లు రాజిరెడ్డి, శివాని

**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు అక్షర హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులు ఎంట్రెన్స్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ర్యాంకులు సాధించారు. పాలీసెట్(పాలిటెక్నిక్) -2026 పరీక్షలో 10వ తరగతి విద్యార్థిని బి.భానుష్క స్టేట్ 195వ ర్యాంక్ సాధించిందని పాఠశాల డైరెక్టర్లు ఎం.రాజిరెడ్డి, ఎం.శివాని శనివారం విలేకరులకు తెలిపారు. ఇటీవల విడుదలైన టీజీఆర్‌జేసీ పరీక్షా ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు బి.భానుష్క ఎంపీసీ విభాగంలో స్టేట్ 51వ ర్యాంక్, ఎం.సాయిసూరజ్ ఎంపీసీ విభాగంలో స్టేట్ 71వ ర్యాంక్, డి.అర్చన బైపీసీ విభాగంలో స్టేట్ 131వ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఉత్తమ విద్యాబోధన తమ లక్ష్యమని, పరీక్ష ఏదైనా తమ విద్యార్థులు ర్యాంకులు సాధించడం గర్వకారణమన్నారు. ఎంట్రెన్స్ పరీక్షల్లో స్టేట్ ర్యాంకులు సాధించి పాఠశాలకు గుర్తింపు తెచ్చిన విద్యార్థులను అభినందించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు శుభాకాంక్షలు చెప్పారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించడమే తమ లక్ష్యమని, తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.




## మోత్కూరు-రాజన్నగూడెం రోడ్డు పనులు పూర్తి చేయాలని

# ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాస్తారోకో

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని మోత్కూరు పాలశీతలీకరణ కేంద్రం నుంచి రాజన్నగూడెం వరకు చేపట్టిన డబుల్ రోడ్డు విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ మాట్లాడుతూ రోడ్డు పనులు చేపట్టి సంవత్సరాలు గడుస్తున్నా పూర్తి చేయకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సుమారు మూడు సంవత్సరాలుగా రోడ్డు పనులను అసంపూర్తిగా వదిలేయడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని, అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మోత్కూరు మున్సిపాలిటీని దత్తత తీసుకుంటానని ప్రకటించిన స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రధాన రోడ్డు పనులను పట్టించుకోకపోవడమేమిటని ప్రశ్నించారు. భువనగిరి, హైదరాబాద్ రూట్‌లో ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు వెళుతున్నాయని, వాహనదారులు, ప్రయాణికుల ఇబ్బందులను తొలగించేలా వెంటనే రోడ్డు పనులను పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు. భువనగిరి రూట్‌లో నడిచే ఆర్టీసీ బస్సులు రాజన్నగూడెం గ్రామ స్టేజీ వద్ద ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జిట్ట గౌతం, చిప్పలపల్లి నవీన్, సువ్వి కరుణాకర్, రవి, మహావీర్, కొంగరి నవదీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మంత్రి కోమటిరెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజావారధి/మోత్కూరు

కాంగ్రెస్ మోత్కూరు పట్టణశాఖ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రుగౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. నిత్యం ప్రజల్లో ఉండి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడే ప్రజానాయకుడు మంత్రి వెంకట్‌రెడ్డి అని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమం లో మోత్కూరు మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య, కాంగ్రెస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, జిల్లా నాయకులు డాక్టర్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, సర్పంచ్ పైళ్ల నర్సిరెడ్డి, కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న, మార్కెట్ డైరెక్టర్లు పన్నాల శ్రీనివాస్ రెడ్డి, ఎండి.సమీర్, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు సుంకిశాల అనిల్, అవిశెట్టి కిరణ్, నాయకులు బద్దం నాగార్జునరెడ్డి, ముద్దం జయశ్రీ, తండ సత్తయ్య, ఎడ్ల శ్రీను, జినుకల కనకయ్య, యాదగిరి, అర్థ ప్రతాప్ రెడ్డి, రంగారెడ్డి, లక్ష్మయ్య, వెంకటయ్య, నరేష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



# పశుగ్రాసం కోసం రైతులకు ఉచిత జొన్నవిత్తనాలు పంపిణీ


ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో శివశంకర్ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో మదర్ డెయిరీ సహకారంతో పశుగ్రాసం కోసం రైతులకు శనివారం సంఘం చైర్మన్ ఎడ్ల భగవంతు ఉచిత జొన్న విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు పశుగ్రాసం కోసం పంపిణీ చేస్తున్న ఉచిత జొన్నవిత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను ఎన్‌డీడీబీ సహకారంతో చెల్లించాలని ఒప్పందం జరిగిందని, ఈనెలలో ఏడు బిల్లులను చెల్లించి మిగతా బిల్లులను కూడా త్వరలోనే చెల్లిస్తారన్నారు. పాల ఉత్పత్తి పెంచడంతో పాటు రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గాను గేదె పాల వెన్న కిలోకు రూ.806 నుంచి రూ.836, ఆవు వెన్నకు రూ.303 నుంచి రూ.313కు, లీటర్ పాలకు రూ.1.50 పైసలు పెంచారని తెలిపారు. రైతులకు చేయూనితచ్చేందుకు గాను మదర్ డెయిరీ, ప్రభుత్వం ద్వారా ప్రతి రైతుకు ఒక పాడి గేదెను ఇవ్వాలని ప్రతిపాదనలు పెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు ముప్పిడి శ్రీను, చెలగొల్ల మత్స్యగిరి, మర్రిపెల్లి యాదయ్య, బరిగెల శేఖర్, దుడ్డ వెంకన్న, ముక్కామల శ్రీశైలం, ముక్కాల రాములు, కొంగరి బాలరాజు, మర్రిపెల్లి లక్ష్మమ్మ, సంఘ సెక్రటరీ ఉపేష్ తదితరులు పాల్గొన్నారు.



# వడదెబ్బతో వృద్ధుడు మృతి

ప్రజావారధి/మోత్కూరు



మోత్కూర్ మండలం పొడిచేడు గ్రామానికి చెందిన వృద్ధుడు వరికుప్పల శంకరయ్య(65) మృతి చెందాడు. గత కొన్ని రోజులుగా కొడుతున్న తీవ్రమైన ఎండలకు తాళలేక వడదెబ్బతో అస్వస్థతకు గురైన శంకరయ్య శనివారం చనిపోయాడని బీజేపీ మోత్కూర్ మండల మాజీ అధ్యక్షుడు దీటి సందీప్ తెలిపారు. మృతుని భార్య చనిపోగా, కొడుకు రమేష్ ఉన్నారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం తగిన ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని ఆయన కోరారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
24 - 05 - 2026



# కోతికి రూ.600

- మోత్కూరు మున్సిపాలిటీలో కోతుల పట్టివేత
- బడ్జెట్‌లో తొలివిడతగా రూ.3 లక్షలు కేటాయింపు
- ఎన్నికల్లో కోతులను పట్టిస్తామని హామీ ఇచ్చిన కౌన్సిలర్లు

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మున్సిపాలిటీలో ప్రజలను కోతుల బెడద నుంచి రక్షించడానికి మున్సిపల్ పాలకవర్గం చర్యలు ప్రారంభించింది. కోతులను పట్టేందుకుగాను బడ్జెట్‌లో నిధులు కేటాయించి శనివారం నుంచి కోతులు పట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. శనివారం పట్టణంలో మూడు ప్రాంతాల్లో కోతులు పట్టేవారు బోన్లు ఏర్పాటు చేయగా కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య ప్రారంభించారు. పొద్దున్న లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు కోతులు చేసే వీరంగంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డుల్లో పోటీ చేసే కౌన్సిలర్ అభ్యర్థులు కూడా కోతులను పట్టించి వాటి నుంచి విముక్తి కల్పిస్తామని హామీ ఇచ్చారు. 11వ వార్డు కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న ఒక అడుగు ముందుకేసి ఎన్నికల ప్రచారంలో కరపత్రాలు ముద్రించి పంపిణీ చేసి ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ చైర్మన్‌తో సహా కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో చర్చించి కోతులను పట్టించాలని తీర్మానించారు. తొలి విడతలో కోతులను పట్టించేందుకు గాను బడ్జెట్‌లో రూ.3 లక్షలు కేటాయించామని, ఒక్క కోతిని పట్టేందుకు రూ.600 కోతులను పట్టుకునే వారికి చెల్లించాలని నిర్ణయించి తిరుపతికి చెందిన వ్యక్తులతో పట్టిస్తున్నామని కమిషనర్ కె.సతీష్ కుమార్ తెలిపారు. పట్టిన కోతులను దూర ప్రాంతాల్లోని అడవుల్లో వదిలేస్తామన్నారు. దశలవారీగా అన్నివార్డుల్లో పట్టిస్తామని చెప్పారు. మండలంలోని పాటిమట్ల, దాచారం లాంటి గ్రామాల్లో కోతులు పట్టేవారికి ఒక కోతికి రూ.300 నుంచి 400 వరకు చెల్లించారని, పట్టణంలో కోతులు పట్టేవారికి రూ.600 చెల్లిస్తుండటంతో మున్సిపాలిటీపై ఆర్థిక భారం పడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కౌన్సిలర్లు మరోమారు సమీక్షించి కోతుల బెడద నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సతీష్ కుమార్, కౌన్సిలర్లు కారుపోతుల వెంకన్న, కుర్మిళ్ల ప్రమీల, కాంగ్రెస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, ఎండి.సమీర్, నాయకులు బద్దం నాగార్జునరెడ్డి, అవిశెట్టి కిరణ్, మెంట నగేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
21 - 05 - 2026





పాటిమట్లలో ఘనంగా..

# పెద్ద మైసమ్మ పండుగ

## అమ్మవారికి బోనాలు సమర్పించిన మహిళలు

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో శనివారం పెద్ద మైసమ్మ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారికి భక్తి శ్రద్ధలతో బోనాలు వండి డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి కొత్త బట్టలు పెట్టి, టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కుల పెద్దలు పండుగ కోసం ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. గ్రామ ప్రజలు బంధు మిత్రులను పిలుచుకుని పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు పెద్దమేతరి కురిమేటి యాదయ్య, చిరుమర్తి యాదయ్య, సారుకొల్ల మేతరి కురిమేటి యాదయ్య, కురిమేటి యాదయ్య(జీజేసీ) తదితరులు పాల్గొన్నారు.

